


కన్నుల పండువగా వెంకన్న రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులోని వేంకటేశ్వర దేవాలయ బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన జాతర మహోత్సవంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు అర్చన కార్యక్రమాలను నిర్వహించి వేడుకలను జరిపారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను రథంలో ఉంచి రథోత్సవం జరిపారు. మహిళలు మంగళ హారతులు, కోలాటాలు ఆడుతూ స్వాగతం పలికారు. రథంను భక్తులు లాగుతూ మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవంలో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో దేవాలయ ఆవరణ సందడిగా మారింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా కోరుట్ల ఎస్ఐ చిరంజీవి బందోబస్తు నిర్వహించారు.

నేడు కరీంనగర్‌కు గవర్నర్ రాక

'శాతవాహన' స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు

7లో

పశువులకు టీకాలు వేయించాలి

రాయికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని జగిత్యాల జిల్లా పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భోనగిరి నరేష్ అన్నారు. మండలంలోని అలూ రు గ్రామంలో గురువారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి అశోక్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


● **జగిత్యాలరూరల్:** జగిత్యాలరూరల్ మం డలంలోని హబ్సీపూర్‌లో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కల్లెడ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వాసు పావ ని, లైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు జ్యోతి, నరేష్, విశాల్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి..

మల్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ మల్యాలలో గురువారం బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శివ, ఉపేంద్ర, ప్రణీత్, తరున్, దావుద్, ఉస్మాన్, రూపేశ్, లవన్ పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు వేళాయే..

- నేడు జగిత్యాల స్టేడియంలో ప్రారంభం
- జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపికలు
- ఏడు అంశాలపై పోటీలు



జగిత్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెల్లోని యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం యువజన ఉత్సవాలకు శ్రీకారం చుట్టింది. చదువుతో పాటు కళలు, కళా ప్రదర్శనలు ఆటల్లో యువతను ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా ఏడు కేటగిరీల్లో ప్రదర్శనలకు అవకాశం ఇస్తూ జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.

జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో యువజన క్రీడల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తు న్నారు. జానపద నృత్యం (గ్రూప్), జానపద పాటలు (గ్రూప్), కథా రచన(తెలుగు, హిందీ, ఇంగ్లీష్), పెయింటింగ్, ఉపన్యాసం (హిందీ, ఇంగ్లీష్, తెలుగు), కవిత్వం (హిందీ, ఇంగ్లీష్, తెలుగు), ఇన్నోవేషన్ ఆఫ్ ట్రాక్ (ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా) నిర్వహిస్తున్నారు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయసు వారు మాత్రమే అర్హులు. ఇందుకు సంబంధించి కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు 29వ జాతీయ యువజన దినోత్సవం 2026 కోసం సంబంధిత శాఖ అధికారులు జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు...

మొత్తం ఏడు కేటగిరీలు ఉండగా ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయిలో జరిగే వేడుకలను పంపిస్తారు.

అంశాలు, నిబంధనలు..

● **జానపద నృత్య బృందం**

ఈ బృందంలో సభ్యుల సంఖ్య 10కి మించరాదు. ప్రదర్శనకు గరిష్ఠ కాల పరిమితి 15 నిమిషాలు. భారత సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. సినిమా పాటలను అనుమతించరు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చుకోవాల్సి ఉంటుంది.

● **జానపద పాటల బృందం**

సభ్యుల సంఖ్య 10 మందికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ఠ కాల పరిమితి 7 నిమిషాలు. భారత సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. సినిమా పాటలను అనుమతించరు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చుకోవాల్సి ఉంటుంది.

● **కథా రచన (హిందీ, ఇంగ్లీష్, తెలుగు)**

ఒక్కొక్కరు ఒక రచనను సమర్పించాలి. వ్యాస రచన వెయ్యి పదాల సముదాయంతో 60 నిమిషాలలో పూర్తి చేయాలి. ఏ కులాన్ని గానీ, ఏ మతాన్ని గానీ, జాతిని గానీ, వర్గాన్ని గానీ కించపరిచే విధంగా ఉండకూడదు. రచనలో అభ్యంతరకరంగా గానీ, అస్పష్టంగా గానీ అనుచిత వ్యాఖ్యలు ఉండకూడదు.

● **పెయింటింగ్**

ఒక్కొక్కరు ఒక పెయింటింగ్ మాత్రమే సమర్పించాలి. ఎంట్రీ ఒరిజినల్ అయి ఉండాలి. పెయింటింగ్ ఏ3 సైజులో 90 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి. పెయింటింగ్ ఏదైనా నిర్దిష్ట సంస్థకు లేదా బ్రాండ్ పేరు ప్రాతినిధ్యం ఉండకూడదు. చిత్రలేఖనానికి సంబంధించిన శీర్షిక 20-30 పదాలు మించకూడదు. పెయింటింగ్ సామగ్రిని

మిగతా 8వ పేజీలో..



అథ్లెటిక్ పోటీలకు పొలాస విద్యార్థులు ఎంపిక

జగిత్యాలరూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండల స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జగిత్యాల రూరల్ మండలం పొలాస ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మణిచరన్, శ్రీకర్, మణిచరణ్ అనే విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి జిల్లా అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అజయ్‌బాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఇఓ గంగాధర్, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి అభినందించారు.

'రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం డిమాండ్ చేశారు. గురువారం పెగడపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకుతో కలసి సత్యం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల ఓ రౌడీషీటర్ నిజామాబాద్ జిల్లాలో విధినిర్వహణలో ఉన్న పోలీసును హత్య చేశాడని, నిన్న జగద్గిరిగుట్టలో ముగ్గురు రౌడీషీటర్లు మిట్టమధ్యాహ్నం నడిరోడ్డుపై కత్తులతో పొడుచుకుంటే కనీసం పోలీసులు ఆపే ప్రయత్నం చేయలేదని అన్నారు. అంటే తెలంగాణాలో శాంతిభద్రతలు ఏ రేంజ్‌లో కరువయ్యాయో అర్థం అవుతుందని అన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, నాయకులు గట్టయ్య, రాము, సతీష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్



సైబర్ నేరాలపై వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న సీఐ కరుణాకర్

జగిత్యాల టౌన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని మిని స్టేడియం, ధర్మపురి రోడ్డులోని ఎస్‌కె ఎన్ ఆర్ డిగ్రీ కళశాల వాకింగ్ మైదానాల్లో గురువారం ఉదయం పట్టణ పోలీసుల అధ్వర్యంలో వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ కరుణాకర్ మాట్లాడుతూ ప్రజలు ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవిలు చేయడం, షాపింగ్, ట్రేడింగ్, సోషల్ మీడియా ఉపయోగించడం లాంటి సందర్భాలలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం సైబర్ మోసగాళ్ళు పలు రకాలుగా మోసం చేస్తున్నారని, ఫోన్ కాల్స్, ఫేక్ వెబ్‌సైట్లు, సోషల్ మీడాయా లింక్స్, ఆన్‌లైన్ ఇన్వెస్ట్ మెంట్ ద్వారా వ్యక్తిగత వివారాలు దొంగిలించి ఖాతాల్లోంచి డబ్బు తీసుకుంటున్నారని తెలిపారు. అనుమానాస్పద లింక్‌లను ఓపెను చేయవద్దని, బ్యాంక్ వివారాలు, ఓటిపి, ఆధార్, పాన్ నంబర్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి ఇవ్వరాదని పేర్కోన్నారు. ఏదైన అనుమానం వస్తే వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెం. 1930 కాల్ చేయాలని, లేదా సైబర్ క్రైం వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని సిఐ సూచించారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. ఆన్‌లైన్ పట్ల విద్యార్థులు అప్రమత్తతో ఉండాలని, అవసరమైన మేరకే వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీలో డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్‌పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ కరుణాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రస్తుత డిజిటల్ యుగంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాల గురించి సమగ్రంగా వివరించారు.

ఫోన్‌కాల్స్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, బ్యాంకింగ్ యాప్‌లు, మరియు మోసపూరిత లింక్‌ల ద్వారా జరుగుతున్న మోసాలను గుర్తించే పద్ధతులు, వాటి నివారణ చర్యలు అలాగే బాధితులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత సమాచా రం ఎవరికీ పంచుకోవద్దని, అనుమానాస్పద లింక్‌లు క్లిక్ చేయరాదని సూచిం చారు. చిన్న వయసులోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. దాని వల్ల సమాజానికి మేలు కలగాలని ప్రేరణాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆసక్తిగా వింటూ తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రవికిరణ్, కుమారస్వామి, పాఠశాల డైరెక్టర్‌లు బియాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కళాశాలల అధ్యాపకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఫీజుబకాయిల చెల్లింపుల జాప్యంను నిరసిస్తూ కళ్లకు గంతలు కట్టుకొని తమ నిరసనను తెలియ జేశారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత నాలుగు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు నిరవధిక బంద్‌ను చేపట్టిన ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం విచారకరం అన్నారు. బంద్‌కు మద్దతుగా తామంతా కళ్లకు గంతలు కట్టుకొని నిరసనను తెలియజేశామన్నారు. పెండింగ్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకుంటే ఉన్నత విద్య కుంటుపడే అవకాశం ఉందని, కళాశాల నిర్వహణ యాజమాన్యాలకు భారంగా మారి, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని స్థితిలో ఉన్నారని ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, ఎస్ఎస్‌వి కళాశాల ప్రిన్సిపాల్ గోపు మునీందర్ రెడ్డి, మల్లికార్జున్, నలంద డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌తో పాటు ఆయా కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎంఏ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐఎంఏ భ వన్‌లో ఈనెల 10న ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఏపీఐ హెల్త్ క్లినిక్ ఆఫ్ జగిత్యాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వ హించనున్న ఉచిత కృత్రిమ కాలు కొలతల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, ఏపీఐ అధ్యక్షుడు మంచాల కృష్ణలు ఒక ప్రకటనలో కోరారు. ప్రమాద వశాత్తు వివిధ కారణాల వల్ల ఎవరికైనా కాలు తీసి వేయబడినచో వారికి కృతిమ కాలు (జైపూర్‌ఫూట్) పొంద వచ్చన్నారు. అవసరము ఉన్న వారు సెల్ నంబరు 9246990055కు వాట్సాప్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

రాయితీపై ఉద్యాన పనిముట్లు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం కింద ఉద్యాన యాంత్రీకరణలో భాగంగా రైతులకు వివిధ రకాల పనిముట్లు, యంత్రాల కొనుగోలుపై రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి గానూ పవర్‌టిల్లర్‌లు, పవర్ వీడర్‌లు, పవర్ స్ప్రేయర్లు, బ్రష్ కట్టర్‌లు ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు మహిళా రైతులతో పాటు ఇతర రైతులకు రాయితీతో అందించబడునని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 265 యూనిట్లకు అవకాశం ఉందన్నారు. జిల్లాలోని ఉద్యాన రైతులు పై పథకంల ద్వారా లబ్ధి పొందవల్సిందిగా, ఆయన కోరారు. ఆసక్తిగల రైతులు తమ పరిధికి సంబంధించిన ఉద్యాన అధికారులను లేదా జిల్లా కేంద్రంలోని ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్వాతి, జగిత్యాల ఉద్యాన అధికారి 8977714044, శ్రీనివాస్ , కోరుట్ల ఉద్యాన అధికారి 8977714043 లేదా శ్యామ్ ప్రసాద్ జిల్లా ఉద్యాన అధికారి 8977714045 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

సబ్‌స్టేషన్ నిర్మాణంతో రేడియేషన్ భయం లేదు

ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం

కథలాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వల్ల రేడియేషన్ ఏర్పడుతుందనే అపోహలు వద్దని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం పేర్కొన్నారు. గురువారం కొనసాగుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను స్థానిక ఏఈ దివాకర్‌రావుతో కలిసి పరిశీలించారు. కొందరు ఈ మధ్యకాలంలో సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల రేడియేషన్ ఉత్పత్తి అవుతుందని ఆందోళన చెందుతున్నారని అలాంటిది ఉండదన్నారు. సబ్‌స్టేషన్ పూర్తయితే రుద్రంగి, కథలాపూర్, బీమారం, మేడిపలి, కోరుట్ల మండలాల్లో ఉన్న లోవోల్టేజీ సమస్య పూర్తిగా తీరుతుందని పేర్కొన్నారు. అనంతరం అంబారిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని పోతా రంలో బ్రేకర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు గంగారాం, మధుసూదన్, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మల్లాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణరావు గురువారం మల్లాపూర్ మండలంలోని సిర్పూర్, నడికుడా, పల్లె, మొగిలిపేట గ్రామాలను పార్టీ నాయకులతో కలిసి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయా కారణాలతో మృతి చెందిన కుటుంబాల ఇంటికి వెళ్లి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. వెంట కాంగ్రెస్ నాయకులు బాపురెడ్డి, మైపాల్, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే

పెగడపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాల వల్ల దెబ్బ తిన్న పంట పొలాలను గురువారం పరిశీలించి నష్టం వివరాలు సేకరించారు. మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తీర్ణాధికారి అక్షయ్‌లు పంట పొలాలకు వెళ్లి పంట నష్టం వివరాలు సేకరించారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు

రాయికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రాయికల్ ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంజాయి కేసులో మండలంలోని కుమ్మరిపెల్లికి చెందిన దొంతి సాయి పరారీలో ఉండగా, బుధవారం పట్టణంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో అతడిని చూసిన కాని స్టేబుల్ వెంకటేష్ పట్టుకున్నాడు. నిందితుడిని వాహనం నడపమని కాని స్టేబుల్ ద్విచక్ర వాహనం వెనుక కూర్చోగా, పోలీస్‌స్టేషన్ వచ్చినా ఆపకుండా సాయి వాహనాన్ని వేగంగా నడిపాడు. అదుపు తప్పి కింద పడటంతో కాని స్టేబుల్ వెంకటేష్‌కు గాయాలయ్యాయి. ఇంతలో అక్కడికి మరో ఇద్దరు పోలీసులు, నిందితుడి తండ్రి మురళి, వరుసకు సోదరుడైన నాగరాజు చేరుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగి సాయిని అరెస్టు చేయకుండా అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించారు. కాని స్టేబుల్ వెంకటేష్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



ధాన్యం తేమను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

మెట్‌పల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ లత నిర్వాహకులకు సూచించారు. గ్రామాల్లోని వరి కొను గోలు కేంద్రాలకు ధాన్యం తీసు కొచ్చిన రైతులకు వెంటనే రసీదులు జారీ చేయాలన్నారు. రైతుల వివరాలను అన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లత నిర్వహకులకు సూచించారు.

గురువారం మండలంలోని చౌలమది, రామరావుపల్లె గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కుప్పలు, రికార్డుల నమోదు, అన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియ గురించి తెలుసుకుని, రైతులతో మాట్లాడినం తరం ధాన్యం మ్యాచర్ పరిశీలించారు. అనం తరం పెద్దాపూర్ గ్రామ శివారులోని రైస్ మిల్లును పరిశీలించి వచ్చే ధాన్యమును వెంటనే అన్‌లోడ్ చేసుకుని లారీలను నిలపకుండా హమాలీలను ఎక్కువగా ఉంచుకోవాలని సూ చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన సంప్రదించడానికి ఏర్పాటు చేసిన 18004258187 టోల్ ఫ్రీ నంబ రును ఫ్లెక్సీలో రాయాలన్నారు. కేంద్రా లకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు తమ వివరాలను నిర్వహకులకు అందజేసి సహకరించాలన్నారు.

మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. మీసేవా సర్టిఫికెట్లను పెండింగ్‌లు లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి దరఖాస్తుదారులకు అందించాలని అధికారలుకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నీత, గిర్దావర్లు ఉమేష్, కాంతయ్య, అధికారులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఐటీఐ పాసైన అభ్యర్థుల కోసం ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను ఈ నెల 10వ తేదీన జిల్లా కేంద్రంలోని స్థానిక ధరూర్ క్యాంప్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌రవీందర్ తెలిపారు. ఈ మేళాకు ఎల్‌టీ కంపెనీ, వరుణ్ మోటార్స్, స్నైండర్ ఎలక్ట్రికల్స్, రాణే ఇంజిన్వాల్వ్, పాజిటివ్ ఎనర్జీ సొల్యూషన్, విండ్ పవర్ హైదరాబాద్, టాటా మోటార్స్, ఆదర్శమోటార్స్, ఎంఆర్‌ఎఫ్ హైదరాబాద్ వంటి సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు ట్రైనింగ్ ఆఫీసర్ రాజేశ్వర్‌రెడ్డి 9618593941 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బీర్‌పూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగూర్, చెర్లపల్లి, కందెనకుంట, మోతినగర్ గ్రామాలలో గురువారం బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ ముప్పాల రాంచందర్ రావ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఏవో తిరుపతి, ఆర్ఐ రాహుల్, ఏవో తిరుపతి పాల్గొన్నారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం



భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

వేములవాడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక మాసంలో భాగంగా గురువారం రాత్రి కార్తీకదీపోత్సవం నిర్వహించారు. ఈ దీపోత్సవంలో భాగంగా సుహాసీనులు దీపాలను వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు, భజనలతో అలరించారు. కార్తీకదీపోత్సవంలో పాల్గొన్న సుహాసినులకు పసుపుకుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి ఫోటోతో కూడిన వాయినంను ఏఈవో అశోక్ అందజేశారు. ఈ ఉత్సవాల్లో సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివసాయి, గట్టు గౌతం, అర్చకులు పాల్గొన్నారు.

చిట్టీల వ్యాపారి అరెస్ట్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధిక డబ్బులు వస్తాయని ఆశజూపి ప్రజల వద్ద నుండి చిట్టీల పేరున నిలువు దోపిడిచేసిన వ్యాపారిని పెద్దపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి పట్టణంలో సుమారు 40మంది నుండి నెలనెలా డబ్బులు తీసుకొని ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. డిసెంబర్ నుండి తప్పించుకొని తిరుగుతున్న పెద్దపల్లి భరత్‌నగర్‌కు చెందిన ఠాకూర్ హనుమాన్ ప్రసాద్ కోసం ప్రత్యేకంగా టీమ్‌ను ఏర్పాటు చేసి గురువారం అరెస్టు చేశారు. అతని బాధితులు ఎవరైనా ఉంటే పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.



వ్యాపారి అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

వంతెన పూర్తయ్యేదెన్నడో?

- రెండు నియోజకవర్గాల మధ్య రాకపోకలకు కీలకం
- అసంపూర్తిగా నిర్మాణ పనులు..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు

బోయినపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రెండు నియోజకవర్గాలను కలిపే వంతెన నిర్మాణానికి పట్టిన గ్రహణం వీడడం లేదు. ఈ వంతెన చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని గ్రామాల మధ్య రాకపోకలకు కీలకమైనది. వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్ వరకు పాదయాత్ర, బైక్ ర్యాలీ, ఆందోళనలు చేపట్టినా నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో ప్రభుత్వ తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోయినపల్లి మండల కేంద్రం నుంచి వేములవాడ పట్టణానికి వెళ్లే దారిలో గంజి వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి గతంలో ప్రారంభమయ్యాయి.అయితే కాంట్రాక్టర్ వంతెన నిర్మాణంలో భాగంగా పిల్లర్లు వేసి మధ్యలో నిలిపివేశాడు. చేసిన పనులకు లక్షలకు ఎంబీ రికార్డు అయినా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతోనే సదరు కాంట్రా క్టర్ పనులను మధ్యలో నిలిపివేసినట్టు సమాచారం. పనులను పూర్తిచేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కొద్దిపాటి వర్షానికి గంజి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోతాయి. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని పలుమార్లు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. పలుమార్లు ఆందోళనల తర్వాత అధికారులు వంతెన పక్కన తాత్కాలిక రోడ్డు వేయించారు. ఇటీవల కురిసిన వర్షానికి తాత్కాలిక రోడ్డు సైతం దెబ్బతిన్నది. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి మధ్యలో నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పాదయాత్ర చేస్తున్న ప్రజలు (ఫైల్)

ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు..



– అక్కనపల్లి కరుణాకర్, స్తంభంపల్లి

గంజివాగు హైలెవెల్ వంతెన నిర్మాణానికి సంవత్సరాలు గడుస్తున్నా పనులు ముందుకు లేదు. పనుల పూర్తికి కలెక్టరేట్ వరకు పాదయాత్రతో పాటు బైక్ ర్యాలీ నిర్వహించి ఆందోళనలు వ్రం చేశాం. అయినా పనులు ముందుకు సాగడం లేదు.

వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలి..



– బొంగోని అశోక్, స్తంభంపల్లి

కొద్దిపాటి వర్షానికి గంజి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు వేములవాడ పట్టణానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి వంతెన పనులు పూర్తి చేయాలి.

కాంట్రాక్టు రద్దుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం..

– కె విష్ణువర్ధన్, పీఆర్ డీఈ

పనులు పొందిన కాంట్రాక్టర్ నోటీసులు జారీచేసిన పనులను పూర్తి చేయడంలేదు. దీంతో కాంట్రాక్టు రద్దుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఆదేశాలు రాగానే మళ్లీ టెండర్ పిడిచి పనులను పూర్తి చేయిస్తాం.

టిప్పర్ సీజ్



టిప్పర్‌ను సీజ్ చేస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ చౌరస్తాలో గురువారం అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో డస్ట్ తీసుకెళుతున్న టిప్పర్‌ను సీజ్‌చేశారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎంవీయాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లు అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో కమటం సాయికుమార్ అనే వ్యక్తి మార్చి 2వ తేదీన తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుని రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆఫోన్ జగిత్యాలలో ఉన్నదని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాధితుడు సాయికుమార్‌ను స్టేషన్‌కు పిలిపించిన రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి ఫోన్‌ను అప్పగించారు. ఈ ఫోన్‌ను రికవరీ చేయడంలో కృషిచేసిన కరీంనగర్ రూరల్ కానిస్టేబుల్ కీర్తనను రూరల్‌సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

శంకరపట్నం: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్లోడ్ చేయగా, వాటిని గుర్తించి పోగొట్టుకున్న ఇప్పలపల్లికి చెందిన ఓదెల కార్తీక్‌కు అందజేసినట్లు తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి.. చోరీలకు పాల్పడి..

- విద్యుత్ మోటార్లు, వైర్ల దొంగల అరెస్ట్



దొంగల అరెస్టును చూపుతున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

ముస్తాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపిన కథనం మేరకు ముస్తాబాద్ మండలంలోని బందనకల్ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోపెడ్‌పై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన పర్వతం శ్రీను, నూనే సాయికుమార్‌లుగా గుర్తించారు. వీరు పాతఇనుప సామను కొనుక్కొని అమ్మగా వచ్చినడబ్బుల ద్వారా కుటుంబాలను పోషించుకునేవారు. జల్సాలకు, కుటుంబ పోషణకు డబ్బులు సరిపోవడం లేదని ఎలాగైనా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో విద్యుత్ మోటార్‌లు, వైర్‌ను రాత్రి సమయంలో దొంగిలించాలనే ఆలోచనకు వచ్చి గజ్వేల్‌కు చెందిన బడే అనిల్, మోతే సాయిలుతో తమ ఆలోచనను పంచుకున్నారు. వారు కూడా అంగీకరించడంతో తెర్లుమద్ది శివారులోని అర్జున్ క్రషర్‌లో నెలరోజుల క్రితం మూడు సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. అదేరోజున తిరుమల రైస్‌మిల్‌లో 4విద్యుత్‌మోటర్‌లు, 20 రోజుల అనంతరం మళ్లీ అర్జున్ స్టోన్ క్రషర్‌లోకి రాత్రిపూట ప్రవేశించి ఏడు టిప్పర్ బ్యాటరీలు, ట్రాక్టర్ బ్యాటరీ ఇతర ఇనుప వస్తువులు ఎత్తుకెళ్లారని తెలిపారు. అలాగే మండలంలోని పోత్గల్, మద్దికుంట, చీకోడ్, మోర్రాపూర్, గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్దగల విద్యుత్ మోటార్లు, వైర్లు ఎత్తుకెళ్లారని వివరించారు. వారి వద్ద ఉన్న మోటార్లు, బ్యాటరీలు స్వాధీనం చేసుకొన్నామని, వాటి విలువ దాదాపు రూ4 లక్షలు ఉంటుందన్నారు. పర్వత శ్రీను, నూనే సాయికుమార్ లను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మిగతా నేరస్థులు పరారీలో ఉన్నారని తెలిపారు. దొంగతనాలను చేధించిన ఎస్సై సీహెచ్ గణేశ్, పీసీలు ఎండీ ఖాసీం, రాజశేఖర్, టి నరేశ్‌లను డీఎస్పీ అభినందించారు.

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో..
చికిత్స పొందుతూ ఐదుగురు మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో వివిధ సందర్భాల్లో గాయపడి, ఆత్మహత్యాయత్నం చేసుకుని చికిత్స పొందుతున్న ఐదుగురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

ఎల్బాకలో..

వీణవంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన తప్పెట అనిల్(26) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గతనెల 24వ తేదీన అనిల్‌ను అదేగ్రామానికి చెందిన బొట్ల అరవింద్ మరికొందరితో కలిసి గ్రామ చివరున రైస్‌మిల్లు వద్దకు తీసుకెళ్లారు. వారు మద్యం తాగారు. కాగా అనిల్‌కు అరవింద్ తమ్సప్‌లో గడ్డిమందు కలిపి తాగించాడు. దీంతో వాంతులు కాగా గ్రామంలోని ఆర్‌ఎంపీ దగ్గరకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు అనిల్ తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పురుగుల మందు తాగి..

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి(44) చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా ఎలాంటి పని చేయకుండా ఖాళీగా ఉండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో రాజేశ్వర్‌రెడ్డి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

కోల్‌సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం ఆఫీస్ బీ గెస్ట్‌హౌస్ కార్నర్ రాజీవ్ రహదారిపై ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎల్‌ఐసీ ఏజెంట్ రౌతు రాజన్న(56) చికిత్స పొందుతూ గురువారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందినట్టు వన్‌టౌన్ ఎస్ఐభూమేష్ తెలిపారు. రాజన్నబైక్‌పై గోదావరిఖని నుంచి మంచిర్యాల వైపు వెళుతుండగా బీ గెస్ట్‌హౌస్ కార్నర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతని పరిస్థితివిషమంగా ఉండడంతో కరీంనగర్‌ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. చికిత్సపొందుతూ గురువారంమృతిచెందాడు. మృతుడికుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్టుపోలీసులు పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసి..

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన ముస్కు శివ(25) అనే యువకుడు చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివకు 11 నెలల క్రితం వివాహం జరిగింది. కొన్నినెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్న శివ ఎన్ని ఆసుపత్రుల్లో చూపించుకున్నా నయంకాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల1వ తేదీన మొగ్దుంపూర్ గ్రామ శివారులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు అతడిని అదేరోజున కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడిశివ తండ్రి నారాయణ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ సీఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..



ఎల్లుట్ల కృష్ణ(ఫైల్)

కోరుట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో నాలుగు నెలలక్రితం విద్యుదాఘాతానికి గురైన ఎల్లుట్లకృష్ణ (33) గురువారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. పట్టణంలో వినాయకవిగ్రహాల తయారీ కేంద్ర వద్ద జూన్15న విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందగా 8మందికి గాయలయ్యాయి. ప్రమాదంలో ఎల్లుట్ల కృష్ణ గాయపడగా కుటుంబసభ్యులు అప్పుడు చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. కొద్దిరోజుల అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. కానీ అతడికి అయిన గాయం మానకపోవడంతో జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో చికిత్సను అందించారు. గురువారం మధ్యాహ్నం తీవ్రఅస్వస్థతకు గురై చికిత్సపొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం అపహరణ

జగిత్యాలరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ పాటిమీది మల్లన్న సమీపంలో గల ఆంజనేయ పురాతన విగ్రహాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు కల్లెడ గ్రామస్థులు తెలిపారు. ఈవిషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్

జ్యోతినగర్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో పలువురు రౌడీ షీటర్లకు రామగుండం సీఐ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ మంచి ప్రవర్తనను కలిగి ఉండాలని తెలిపారు. ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పకుండా తమ పనులు చేసుకోవాలని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సబ్ రిజిస్ట్రార్‌పై కొనుగోలుదారుడి ఆగ్రహం

- ఒకే సర్వేనంబర్‌లో ఒకటి చేసి మరొకటి రిజెక్ట్
- ఎన్‌వోసీ తీసుకొచ్చినా చేయని వైనం



ఆందోళన చేస్తున్న భూమయ్య

గంగాధర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగాధర అదనపు బాధ్యతలు చేపడుతున్న సబ్‌రిజిస్ట్రార్ కావాలని రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తున్నాడని కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన రేణిగుంట భూమయ్య అదేగ్రామంలో సర్వే నంబర్ 371బి15లో 232 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. అయితే ఈనెల 3న డాక్యుమెంటుతో గంగాధర రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చాడు. పరిశీలించిన సబ్‌రిజిస్ట్రార్ ఈ నంబర్లు నిషేధిత జాబితాలో ఉన్నాయని, జిల్లా కలెక్టర్ నుంచి ఎన్‌వోసీ తీసుకువస్తే చేస్తానని భూమయ్యకి తెలిపాడు. దీంతో భూమయ్య రామడుగు తహసీల్దార్ నుంచి ఈ నంబరుపై ఎన్‌వోసీ తీసుకువచ్చాడు. గురువారం కార్యాలయానికి వచ్చిన భూమయ్య రిజిస్ట్రేషన్ చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను కోరాడు. ఇది నిషేధిత జాబితాలో ఉంది నేను చేయనని డాక్యుమెంటును తిరిగి పంపించాడు. దీంతో భూమయ్య సబ్ రిజిస్ట్రార్‌తో ఇదే సర్వెనంబరులో 18ఆగస్టు 2025న మీరేడాక్యుమెంటు రిజిస్ట్రేషన్ చేశారు, నాది ఎందుకు చేయడంలేదని వాగ్వాదానికి దిగాడు. అయితే డబ్బులు ఇవ్వనందుకే రిజిస్ట్రేషన్ చేయడంలేదని భూమయ్య ఆరోపిస్తున్నాడు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ సర్వేనంబరు నిషేధిత జాబితాల్లో ఉంది. చేయడానికి నా పరిధి కాదు అయినా చేయాలని డిమాండ్ చేశాడు. నేను ఎవరిని ఎలాంటి ప్రలోభాలకు గురి చేయలేదన్నాడు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

మంథని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి వద్ద లారీ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో స్థానిక పోచమ్మ వాడకు చెందిన లక్కాకుల సంతోష్ అనే యువకుడు బుధవారం సాయంత్రం గాయపడ్డారు. గంగాపురిలో తనపని ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో మంథని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో సంతోష్ గాయ పడ్డాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



నీరటి రాజు(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగారం గ్రామానికి చెందిన నీరటి రాజు(30) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి పోచమ్మ తెలిపిన వివరాల మేరకు రాజు అతిగా మద్యం తాగేవాడు. రాజు భార్య ఈనెల3న ఇద్దరు కుమారులను తీసుకొని తల్లిగారి ఊరైన ముత్తారం మండలం పారుపల్లికి వెళ్లింది. మద్యం మత్తులో గురువారం గంగారంలో ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

- తల్లి ఆత్మహత్య ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని మల్యాలలో యువకుడు
- పాస్‌పోర్టు ఇవ్వడం లేదని జగిత్యాలలో మరో యువకుడి ఆత్మహత్యాయత్నం



పోలీస్‌స్టేషన్ గేట్‌పై పెట్రోల్ డబ్బాతో ఉన్న మహ్మద్ అఖిల్‌ను ఆపుతున్న సిబ్బంది

మల్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల పోలీస్‌స్టేషన్ మెయిన్‌గేట్ ఎక్కి మహ్మద్ అఖిల్ అనే యువకుడు గురువారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో వెంటనే పోలీసులు, ఇతరులు పెట్రోల్ డబ్బా లాక్కొని ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా మహ్మద్ అఖిల్ మాట్లాడుతూ తన తల్లి అన్వరీబేగం ఆత్మహత్య ఘటనకు కారకులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించాడు. మల్యాల మండలం నూకపల్లి అర్బన్‌హౌసింగ్ కాలనీకి చెందిన అన్వరీబేగం గత నెల 9న ఆత్మహత్యకు పాల్పడింది. అయితే తన తల్లి ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులు, కారకులైన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తాను ఎస్పీ దగ్గరకు వెళతానని మహ్మద్ అఖిల్ చెప్పడంతో గురువారం ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే మరికొంత మందికి కూడా తనతల్లి ఆత్మహత్యలో భాగస్వామ్యం ఉందని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆత్మహత్యయత్నం చేశాడు. ఈవిషయమై మల్యాల ఎస్సై నరేశ్ కుమార్‌ను సంప్రదించగా ఆత్మహత్య ఘటనలో ఫిర్యాదు వచ్చిన వ్యక్తిపై విచారణ జరుపుతున్నామని కేసు విచారణ కొనసాగుతోందని తెలిపారు.

పాస్‌పోర్టు ఇవ్వడం లేదని యువకుడి ఆత్మహత్యాయత్నం..

జగిత్యాల టౌన్: కన్సల్టెన్సీ నిర్వాహకులు పాస్‌పోర్టు ఇవ్వడం లేదని గురువారం నిద్రమాత్రలు మింగి అయితం శ్రీకాంత్ అనే యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన అయితం శ్రీకాంత్ జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీక్రిష్ణ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ తరఫున గల్ఫ్ పంపుతా అంటే నెలరోజుల క్రితం పాస్‌పోర్టు ఇచ్చాడు. వీసా రాక ముందే వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు చెప్పగా రూ.7వేలు చెల్లించి చేయించుకున్నాడు. ఆఫర్ లెటర్ అడిగితే ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ముందు ఒప్పందం చేసుకున్న విధంగా కాకుండా పనిభారం 12గంటల వరకు పెంచి, భోజన వసతి జీతంలోంచి చెల్లించాలని పేర్కోన్నారని తెలిపాడు. అలా అయితే వద్దని తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరగా తిప్పించుకుంటున్నారని ఆరోపించాడు. పాస్‌పోర్టు ఇవ్వకపోవడంతో గురువారం కన్సల్టెన్సీకి వచ్చిన శ్రీకాంత్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంటవచ్చిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం గురువారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 21,954 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరదగేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టునుంచి 28,204 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్‌గేట్ల ద్వారా 8వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల

ఇల్లంతకుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.43టీఎంసీల నీరు ఉంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి 100 క్యూసెక్కుల నీరు క్యాచ్‌మెంట్ ద్వారా వస్తుండగా, 118క్యూసెక్కుల నీరు సర్‌ప్లస్ గేట్ల ద్వారా విడుదల అవుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

ఎల్ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండుగేట్ల నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న 4254క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తుండగా, రెండు స్పిల్‌వేగేట్లు ఒకఫీట్‌మేర ఎత్తి4వేలక్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరిరూపంలో 254క్యూసెక్కులు మొత్తం 4254క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.



ఎల్ఎండీ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

క్రమశిక్షణ.. దేశభక్తి

- విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపు
- నేడు భారత స్కౌట్స్, గైడ్స్ ఫౌండేషన్ డే



తాళ్లతో నిర్మించిన బ్రిడ్జిపై శిక్షణ పొందుతున్న గైడ్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినయం, ఔన్నత్యం, సహాయ గుణం కలగలిపి క్రమశిక్షణకు మారుపేరుగా, నైతిక విలువలకు చిరునామాగా ఏర్పడిన ఉద్యమమే స్కౌట్స్ అండ్ గైడ్స్. విద్యార్థులు, యువతలో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం.



స్కౌట్ శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

● నేపథ్యం

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను ప్రతి సంవత్సరం నవంబర్ 7న జరుపుకుంటారు. 1950లో ఇదే రోజున దేశంలోని బాయ్ స్కౌట్స్ అసోసి యేషన్, హిందుస్థాన్ స్కౌట్ అసోసియేషన్ విలీన మయ్యాయి. అప్పటి నుంచి భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఏర్పాటయింది. ఒక సంవత్సరం తర్వాత 1951 ఆగస్టు 15న ఆలిండియా గర్ల్ గైడ్స్ అసోసియేషన్ కూడా ఈ సంస్థలోనే చేరింది. ఈ నేపథ్యంలో నవంబర్ 7న స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను భారతదేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు.

● వివిధ రకాల శిక్షణలు

స్కౌట్స్ గైడ్స్‌కు పయనీరింగ్ అంటే ముడులు వేయడం, టెంట్ నిర్మాణం, వంతెనను నిర్మించడం తది తర అంశాలపై శిక్షణ అందిస్తారు. అలాగే ప్రథమ చికిత్స చేయడం, పేషెంట్లను ఎతుకెళ్లే పద్ధతులు, కృత్రిమ శ్వాస అందించడంలో శిక్షణ ఇస్తారు. మ్యాపింగ్ అండ్ కంపాస్‌లలో శిక్షణ ఇస్తారు. అంతర్జాతీయ పటాలను చదవడం, దిక్సూచి ఉపయోగించుకోవడం నేర్పిస్తారు. ఎత్తులు, లోయలు, పొడవు, వెడల్పులను అంచనా వేయడం, ట్రెక్కింగ్, శారీరక దృఢత్వానికి ఫుట్ డ్రిల్, మార్చ్‌పాస్ట్, యోగా వంటి వ్యాయామాలు నేర్పిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో 824 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా స్కౌట్స్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

● ఉన్నత విద్యావకాశాలు

గవర్నర్ సర్టిఫికెట్ : రాష్ట్రస్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేస్తారు.

రాష్ట్రపతి సర్టిఫికెట్: గవర్నర్ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు జాతీయస్థాయిలో పరీక్ష నిర్వహించి రాష్ట్రపతి సర్టిఫికెట్లు అందజేస్తారు.

ఉద్యోగ రిజర్వేషన్: రాష్ట్రపతి సర్టిఫికెట్లు సాధించిన వారికి రైల్వే సంస్థతో సహా పలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తారు.

పాఠశాల విద్యకు స్కౌట్స్ అండ్ గైడ్స్ జీవనాధారం



- షరీఫ్ అహ్మద్, ట్రైనింగ్ కమిషనర్

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం పాఠశాల విద్యకు జీవనాధారం. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో తెలివితో పాటు వారి మనసును కూడా మలిచే ఒక జీవన పద్ధతి ఇది. తరగతి గదిలో అందని క్రమశిక్షణ, నడవడి, గౌరవభావం వంటి కీలక లక్షణాలు శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు అందుతాయి. పాఠశాల విద్యార్థుల్లో నేను సమాజానికి బాధ్యతగల సభ్యుడిని అనే భావనను పెంచి వారిలో దేశభక్తి, సేవాగుణం, వినయ విధేయతలను పెంపొందిస్తుంది.

పాఠశాల స్థాయిలో క్రమశిక్షణకు చిరునామా

- కంకణాల రాంరెడ్డి, జిల్లా స్కౌట్స్, గైడ్ కార్యదర్శి



స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల స్థాయిలో విద్యార్థుల క్రమశిక్షణకు చిరునామాగా నిలుస్తుంది. యువత భవిష్యత్తుకు జీవన మార్గం చూపెడుతుంది. ఉత్తమ సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత పాల్గొనేలా చేస్తుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు స్కౌట్స్, గైడ్స్ యూనిట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. దీంతో సమర్థవంతమైన పౌరసత్వంవైపు బలంగా అడుగులు వేయగలం.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు చెల్పూర్ విద్యార్థి



గాలిబు చరణ్

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న గాలిబు చరణ్ అనే విద్యార్థి అండర్-17లో రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం గ్రామంలో నిర్వహించే 69వ రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ విద్యార్థి పాల్గొనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పీడీ చిరుత శ్రీనివాస్, రిటైర్డు పీడీ సొల్లు సారయ్య అభినందించారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్‌లో రెండు ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుడు జనగం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున చూసే సరికి తన ఇంటి ముందు నిలిచిఉంచిన రెండు ట్రాక్టర్ల బ్యాటరీలు, రెండు వైబ్రేటర్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్ల శిక్షణ శిబిరాలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఖో-ఖో జట్ల శిక్షణ శిబిరాలు గురువారం ముగిశాయి. కరీంనగర్‌లోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ సౌజన్యంతో ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 10 రోజులపాటు మహిళలు, పురుషుల ఖో-ఖో జట్లకు నిర్వహించిన ఈ శిబిరాల్లో 25 మంది పురుషులు, 20 మంది మహిళలు పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలకు ఎంపికైన మహిళలు, పురుషుల జట్లకు ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని అన్నారు. శిబిరాల్లో పాల్గొన్న జట్లు పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖో-ఖో పోటీల్లో పాల్గొననున్నాయి. కార్యక్రమంలో శిక్షణ శిబిరాల నిర్వాహకులు, కోచ్‌లు డాక్టర్ ఎ రవీందర్, కట్ట సంతోష్, రాములు, కరుణాకర్, చిట్టి తిరుపతిరెడ్డి, వి శ్రీలత, రేణుక, పి జ్యోతి, సౌజన్య, సూర్యప్రకాష్, పి ఆనంద్, జలంధర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రపోటీలకు ఎంపికైన ఉమ్మడిజిల్లా మహిళలు, పురుషుల జట్లు

నేడు కరీంనగర్‌కు గవర్నర్ రాక

● 'శాతవాహన' స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు

కరీంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కరీంనగర్ జిల్లాకేంద్రానికి శుక్రవారం రానున్నారు. ఉదయం 8.15గంటలకు హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి ఆయన రోడ్డు మార్గంలో బయలుదేరి 10.50గంటలకు శాతవాహన యూనివర్సిటీకి చేరుకుంటారు. అక్కడ 12.30గంటల వరకు యూనివర్సిటీ ద్వితీయ స్నాత కోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారు. అనంతరం గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులకు మెడల్స్‌ను ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 12.30గంటలకు భోజనంచేసి 1.45నిమిషాలకు బయలుదేరి రెండు గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. రెండు గంటల నుంచి 2.15గంటల వరకు స్థానికులు తయారు చేసిన హ్యాండిక్రాఫ్టు, సిల్వర్ ఫిలిగ్రీ, ఆహారపదార్థాల స్టాల్స్‌ను సందర్శిస్తారు. 2.15 నుంచి మూడు గంటల వరకు అక్కడే కలెక్టర్, టీబీ అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3నుంచి 3.45గంటల వరకు రచయితలు, కవులు, కళాకారులు, వివిధ రంగాల్లో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన అవార్డు గ్రహీతలతో గవర్నర్ ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.50 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ రాజ్‌భవన్‌కు చేరుకుంటారని రాజ్‌భవన్‌వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

యధాతథంగా పత్తి కొనుగోళ్లు

● మిల్లర్లు ఇచ్చిన బందు పిలుపు వాయిదా



మార్కెట్లోకి వచ్చిన పత్తి

జమ్మికుంట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్ యార్డులో సీసీఐ, ప్రైవేట్‌వ్యాపారుల కొనుగోళ్లు గురువారం యధాతథంగా కొనసాగాయి. నిబంధనలు సడలించాలని డిమాండ్‌చేస్తూ జిన్నింగ్‌మిల్లర్లు పత్తికొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అందుబాటులో లేకపోవడంతో జిన్నింగ్ మిల్లర్లు తాత్కాలికంగా పత్తికొనుగోళ్ల బంద్‌ను వాయిదా వేసుకున్నారు. గురువారం మార్కెట్‌యార్డుకు 61 మంది రైతులు 487క్వింటాళ్ల విడిపత్తి, ఐదుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనేసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.6800, కనిష్ఠ ధర రూ.5700 చెల్లించి కొనుగోళ్లుచేపట్టారు. సీసీఐఐదుగురు రైతుల నుంచి 69క్వింటాళ్ల మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టింది.

కాలువలకు వెంటనే మరమ్మతులు చేయాలి

● సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కాలువలను వెంటనే మరమ్మతు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలుగ్రామాలను ఆయన సందర్శించారు. దెబ్బతిన్న కాలువలను, వరిపంటలను పరిశీలించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలుమండలాల్లో దెబ్బతిన్న, ప్యాకేజీ-3లో పెండింగ్‌లో ఉన్న పనులు, భూసేకరణ లాంటి కార్య క్రమాలు నిర్వహించడానికి దాదాపు 67కోట్లు కావాలని కోరుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీలో నిలిచిపోయిన పనులకు వెంటనే టెండరు పిలవాలని కోరారు. ఆయనవెంట సీపీఐ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రేకొండలో ఇటీవల వర్షాలకు తెగిన రోడ్డును పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని గురువారం ధర్మపురి వద్ద గోదావరి హారతి నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోకక్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్ రావు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచారి, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, ధర్మకర్త రాపర్తి సాయికిరణ్, శారదా మహిళా మండలి, వాసవి మహిళామండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీవల్లి సేవా గ్రూపు సభ్యులు, స్థానిక మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించిన పుణే విద్యార్థుల బృందం

చొప్పదండి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రాథమిక సహకార సంఘాన్ని పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ విద్యాలయంలో పీజీడీఎం చదువుతున్న విద్యార్థుల బృందం గురువారం సందర్శించింది. సహకార రంగంలో వృత్తిపరమైన విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించే లక్ష్యంతో బృందం చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్యాక్స్‌చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, జిల్లాసహకార అధికారి రామానుజచార్యులు సంఘం యొక్క కార్యకలాపాలు, పనితీరు, రైతులకు అందిస్తున్నసేవలు, సంఘంఅభివృద్ధి గురించి వివరించారు. సంఘం జాతీయ స్థాయిలో ఉత్తమ ప్యాక్స్‌గా అవార్డు అందుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ముద్దం మహేష్‌గౌడ్, సీఈవో కళ్లెం తిరుపతి రెడ్డి, సభ్యులు గుర్రం ఆనంద్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, నాంపల్లి మల్లయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.



చొప్పదండి సహకార సంఘంలో విద్యార్థుల బృందం

పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకం

- నేడు ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం
- బహుళ రంగాల్లో ప్రగతి



జ్యోతినగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశీయ విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకపాత్ర పోషిస్తున్నది. దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో నాల్గవ వంతు ఎన్టీపీసీ అందిస్తోంది. విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఎన్టీపీసీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాన్ని విస్తరిస్తోంది. థర్మల్ విద్యుత్ కేంద్రాలతో ప్రారంభమైన ఎన్టీపీసీ ప్రయాణం గ్యాస్, నాఫ్తా ఆధారిత ప్రాజెక్టులు, జల,సాంప్రదాయేతర (సోలార్, పవన) విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో జాయింట్ వెంచర్లు, అనుబంధ సంస్థలతో వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌గా ఉన్న ఎన్టీపీసీ దశాబ్దం క్రితం ఎన్టీపీసీ లిమిటెడ్‌గా అవతరిం చింది. 23 బొగ్గు ఆధారిత(థర్మల్), 7 గ్యాస్(నాఫ్తా), 15 సోలార్ ప్రాజెక్టులు, 2 జల విద్యుత్ ప్రాజెక్టులు, ఒక విండ్, 9 జాయింట్ వెంచర్(సంయుకత్త రంగం)లో మొత్తం 48 ప్లాంట్లను నిర్వహిస్తోంది. ప్రస్తుతం 84,849 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంగల సంస్థ 2032 నాటికి 1.28 లక్షల మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించడానికి ప్రణాళికలను రూపొందించింది. 1975 నవంబరు 7న నేషనల్ థర్మల్ పవర్ కార్పొ రేషన్(ఎన్టీపీసీ) పేరుతో పబ్లిక్ సెక్టార్ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంచెలంచెలుగా ఎదిగిన ఎన్టీపీసీ శుక్రవారంతో 50 ఏళ్లు పూర్తి చేసుకొని 51వ వసంతంలోకి అడుగుపెడుతున్నది.



రామగుండంలోని ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు

● పలు అవార్డులు

50 ఏళ్లలో ఎన్టీపీసీకి ఉత్పత్తి, సేఫ్టీ, సీఎస్ఆర్, మానవ వనరులు, పర్యావరణ పరిరక్షణ, పరిపాలన, నాణ్యత, బెస్ట్‌ప్లేస్ టూ వర్క్ తదితర అన్ని రంగాలలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. గతంలోనే ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా ప్లాట్స్ సంస్థ ఎన్టీపీసీకి ప్రపంచంలో మొదటి ర్యాంకు ప్రకటించింది. ఫోర్బ్స్ ర్యాంకింగ్స్‌లో ఎన్టీపీసీకి 4వ స్థానం, నాలుగు ఆర్థిక సంవత్సరాలుగా డున్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ నుంచి బెస్ట్ పెర్ఫార్మింగ్ సంస్థగా గుర్తింపు సాధిస్తూ వస్తోంది.

● బొగ్గు గనుల నిర్వహణ..

దేశంలో అత్యధిక బొగ్గును ఎన్టీపీసీ వినియోగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో 300 మిలియన్ టన్నుల బొగ్గును ఉపయోగించింది. యేటా సంస్థ స్థాపిత సామర్థ్యం (థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు) పెరుగుతుండడంతో బొగ్గును ఎక్కువ మొత్తంలో ఉపయోగించాల్సి వస్తోంది. బొగ్గు కొరతను ఎదుర్కొనడానికి దేశవ్యాప్తంగా 10 బొగ్గు బ్లాకులు(107 బిలియన్ మెట్రిక్ టన్నులు) ఎన్టీపీసీకి ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పోటీతో పాటు ముడి ఇంధన సమస్యలను అధిగమిం చేందుకు ఎన్టీపీసీ లిమిటెడ్ సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి విధానం అమలు చేస్తున్నది. సంస్థ సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా చిన్న విద్యుత్ కేంద్రాలను నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొం దించింది. సాంప్రాదాయేతర ఇంధన వనరుల ద్వారా 50,000 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఎన్టీపీసీ భావిస్తున్నది. దీనిలో ప్రధానంగా సోలార్, పవన, జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టిసారించింది.

అభివృద్ధి పనుల పరిశీలన

కోరుట్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపీడీవోలుగా ఎంపికైన గణేష్, సురేష్‌లు కోరుట్ల ఎంపీడీఓ రామకృష్ణ అధ్వర్యంలో వివిధ అంశాలపై క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పరిశీలించారు. గురువారం అయిలాపూర్ గ్రామంలోని నర్సరీ, పల్లెప్రకృతి వనం, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణను గురించి ఎంపీడీఓ రామకృష్ణ నూతనంగా ఎంపికయిన ఎంపీడీఓకు అవగాహన కల్పించారు. వారం రోజులుగా మండల ప్రజపరిషత్ కార్యాలయంలో పలు అంశాలపై ఎంపీడీఓలకు శిక్షణను అందించారు. చివర రోజు క్షేత్ర స్థాయి పర్యటనలు జరిపి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవీన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకోవాలి

మల్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తన కొడుకు ఆత్మహత్యకు కారకులైన పలువురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన తల్లి తైదల నర్సవ్వ, లక్ష్మీరాజంతో పాటు గ్రామానికి చెందిన కొందరు మహిళలు పోలీసుస్టేషన్‌కు తరలివచ్చారు. గత నెల 11న తైదల సునీల్ అనే యువకుడు ఉరి వేసుకోగా సునీల్ మృతికి కొందరు కారణ మంటూ అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని కుటుంబ సభ్యులు, మహిళలు పలుమార్లుగా పోలీసు లను కోరుతున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్లు అందుబాటులో లేకపోవడంతో గురువారం రావడంతో ఇద్దరిని విచారణ జరిపారు.

యాదవసంఘాన్ని బలోపేతం చేస్తాం

గొల్లపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు, పట్టణాలలో సభ్యత్వాలు చేసి యాదవ సంఘాన్ని జగిత్యాల జిల్లాలో బలంగా తయారు చేస్తామని యాదవ సంఘం జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేశం యాదవ్ అన్నారు. గురువారం గొల్లపల్లి మండలంలోని రాపల్లిలో గ్రామ యాదవ సంఘం సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లేశం మాట్లాడుతూ సభ్యత్వ నమోదుతో సంఘం బలోపేతం, సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు మహేశ్ యాదవ్, జలందర్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, రాంచరణ్ యాదవ్, భూమయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ధర్మపురి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కరీంనగర్ సన్‌రైజ్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో చుట్టు పక్క గ్రామాలకు చెందిన బూరుగుపల్లె, రామయ్యపల్లె, తిమ్మాపూర్, రాయపట్నం తదితర గ్రామాలకు చెందిన 215 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సన్‌రైజ్ ఆసుపత్రికి చెందిన వైద్యులు డాక్టర్ సురేష్, డాక్టర్ చాందిని, డాక్టర్ కార్తీక్ తదితరులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గ్రామస్తులు పూర్తిగా సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వావిలాల జగదీష్, వెంగల్‌దాస్ శ్రీనివాస్, కుమ్మరి నవీన్, లింగాల హరీష్, కడారి సంపత్‌రెడ్డి, బండపెల్లి సతీష్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు

-పట్టించుకోని రెవెన్యూ అధికారులు -ప్రభుత్వ ఆదాయానికి గండి

మెట్‌పల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా మార్చేస్తూ కోట్ల రూపాయల దండుకొంటున్నారు. మెట్‌పల్లి మండలం చౌలమద్ది గ్రామ శివారులోని భూములు, పట్టణ పరిధిలోని ఆరపేట గ్రామ రెవెన్యూకు చెందిన జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న భూముల ధరలు రెట్టింపు అవ్వడంతో వ్యవ సాయ భూములను ఇళ్ల స్థలాలుగా అనధికారింగా లే అవుట్‌లు వేసి అమ్మేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.



చౌలమద్ది శివారులో చేపడుతున్న నిర్మాణాలు

● అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్లు..

మండలంలోని చౌలమద్ది గ్రామ శివారు నుంచి బైపాస్ రోడ్డు వెళుతుంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకొని అక్రమ లే అవుట్లు పుట్టగొడు గుల్లా పట్టుకొస్తున్నాయి. అక్రమార్కులు అనుమతులు లేకుండానే వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చి ప్లాట్లును విక్రయిస్తున్నారు. మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఆరపేట గ్రామ రెవెన్యూకు చెందిన భూములు మండలంలోని చౌలమద్ది శివారులోని జాతీయ రహదారి వెంట భూముల ధరలు రెట్టింపు అవుతున్నాయి. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం వ్యవసాయ భూముల్లో లేఅవుట్లు చేస్తే 12 శాతం భూమిని అభివృద్ధి కోసం రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. అనుమతులు లేని లే అవుట్లలో ప్లాట్లు కొంటూ కొనుగోలుదారులు నష్టపోతుంటే అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్‌ల్లో లేఅవుట్లు చేయాలంటే అనుమతులు తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి కొంత ట్యాక్స్ చెల్లించాల్సి ఉటుంది. నాలా కోసం మార్కెట్ విలువలో 3 శాతం డబ్బును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే మున్సిపల్, పంచాయతీకి స్థలం బదలాయించకుండా ఇతర ట్యాక్స్‌లు చెల్లించకుండా అక్రమ లేఅవుట్లను చేస్తూ రియల్టర్లు లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఇళ్ల నిర్మాణ సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

-మహేశ్వర్‌రెడ్డి, ఎంపీవో మెట్‌పల్లి

ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రామాల్లో వెంచర్లు వేసి విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసే ముందు అనుమతులు ఉన్నయా లేవా అని తెలుసుకోవాలి. నాలా కట్టకుండా గ్రామాల్లోని వ్యవ సాయ భూముల్లో ప్లాట్లు వేస్తే చర్యలు తీసుకో వాలని కార్యదర్శులకు సూచించాం.

యువజనోత్సవాలకు వేళాయే..

(ఐదో పేజీ తరువాయి)

పెయింటింగ్ సామాగ్రిని ఎవరికి వారే తెచ్చుకోవాలి.

● ఉపన్యాసం (హిందీ, ఇంగ్లీష్, తెలుగు)

ఎంపిక చేసిన అంశంపై ఏదైనా బాషలో ఏడు నిమిషాలు మించకుండా అనర్గళంగా మాట్లాడాలి.

● కవిత్వం (హిందీ, ఇంగ్లీష్, తెలుగు)

ఒక్కొక్కరు ఒక్క రచనను మాత్రమే సమర్పించాలి. వ్యాస రచన 500 పదాల సముదాయంతో 60 నిమిషాలలో పూర్తి చేయాలి.

● ఇన్నోవేషన్ ట్రాక్ (ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా)

యువత సైన్స్ అండ్ టెక్నాలజీలో తయారు చేసిన కొత్త ప్రాజెక్టులను ప్రదర్శనకు తీసుకురావాలి. ఇందులో పాల్గొనే వారు పర్యావరణం, వాతావరణ మార్పు, ఆరోగ్య సంక్షోబాలు వంటి అధునిక సవాళ్లను పరిష్కరించడానికి అవసరమైన ఆలోచన, సమస్య పరిష్కారం, ఆవిష్కరణలకు సంబంధించిన వాటిపై ప్రయోగాలను సైన్స్‌మేళాలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇందులో ఎంపికైన ప్రాజెక్టును రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

-కోరుకంటి రవికుమార్, జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి



జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక వేదికను యువత సద్వినియోగం చేసుకోవాలి. చదువుతో పాటు ఆటలు, కళారూపకంగా రాణిస్తున్న వారికి ఇది చక్కటి వేదిక. ఏడు అంశాలలో పోటీలు జరుగుతాయి. ప్రతి అంశానికి న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో అర్హత సాధించిన ప్రథములను రాష్ట్ర స్థాయికి, అక్కడ విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయికి పంపిస్తారు.

'మహిళా అక్షరాస్యత పెంచాలి'



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూప

కొడిమ్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అక్షర జ్ఞానం సంపాదించుకోవాలని ఎంపీడీవో ఇ. స్వరూప అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశం మందిరంలో మహిళా గ్రామ సంఘాలు, పాలక వర్గ సభ్యులకు, సహాయకులకు వయోజన విద్య అమలుపై ఓరుగల్లు మహాసభ సీనియర్ సీఆర్పీలు జె. అనిత, ఎండీ. కౌశజహా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి మహిళ చదువుకుంటె ఆర్థిక లావాదేవిలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంటుం దన్నారు. ప్రభుత్వం పథకాలను గురించి తెలుసుకోవటానికి, ఇతరులకు తెలుపు టానికి విద్య ఎంతగానో దోహదపడు తుందన్నారు. శిక్షణ పొందిన సభ్యులు ప్రతి మహిళకు విద్యను అందించాలన్నారు.

విద్యతో సామాజిక చైతన్యం, ఆరోగ్య పరిరక్షణ, సమానత్వం పిల్ల విద్య, తదితర అంశాలపై అవగాహన ఉంటుందని ఎంపీడీవో స్వరూప అన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో ఎ. శ్రీనివాస్, ఏపీఎం డి. మల్లేశం, శ్రీ దుర్గ మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సీసీలు శ్రీనివాస్, వీరకుమార్, కమలకుమారి, స్వరూప, అకౌంటెంట్ సుకన్య పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు

కథలాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీర్‌పూర్‌లో సింగిల్ విండో ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు మార్క్‌ఫెడ్‌కు ప్రతిపా దనలు పంపించినట్లు ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, సీఈఓ విజయ్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రంకు ధాన్యం తరలించడానికి దూర భారం అవుతుందని రైతులు కోరుతున్నందునగంభీర్‌పూర్‌లో కేంద్రం అవసరమని మార్క్‌ఫెడ్ అధికారులకు విన్నవించామని చెప్పారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో సమావేశం

మెట్‌పల్లి టౌన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాటర్ ప్లాంట్ యజమానులతో మున్సిపల్ కమిషర్ మోహన్‌లాల్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వాటర్ ప్లాంట్ యజమానులు ఐఎస్ఐ పర్మిషన్ లేకుండా నీటిని సరఫరా చేయవద్దని, అలాగే రెండు నెలల్లోగా గుర్తింపు సర్టిఫికెట్ తీసుకోవా లన్నారు. అలాగే మంచినీటిని అందించే సమయంలో వాటర్ క్యాన్‌లను శుభ్రం చేసి ఇవ్వాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ అక్షయ్ కుమార్, ముజీబ్, వాటర్ ప్లాంట్ యజమానులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

మెట్‌పల్లి రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటిమీద తండా గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయాబెటిస్ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. గురువారం గ్రామంలోని 100 మందికి జనరల్ ఫిజిషియన్ డాక్టర్ అఖిల్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడానికి సహకరిస్తూ వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

-జిల్లా పంచాయతీ అధికారి రేవంత్



పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న డీపీవో రేవంత్

మెట్‌పల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి రేవంత్ సూచించారు. గ్రామాల్లోఉండే స్థానిక వనరులతో పాటు సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రేవంత్ సూచించారు. గురువారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని డంపింగ్ యార్డు, కంపోస్టు తయారు, పల్లె పకృతి వనంలోని చెట్లను పరిశీలించనంతరం పంచాయతీ కార్యలయంలోని రికార్డులను డీఎల్‌పీవో సుదర్శన్‌తో కలిసి పరిశీలించారు. పల్లెలో చేపట్టిన, చేపట్టుతున్న అభివృద్ధి పనుల గురించి ఎంపీవో మహేశ్వర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను సత్వర పరిష్కారంతో పాటు అభివృద్ధిని చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులతో పాటు స్థానిక వనరుల ద్వారా సమకూర్చు కోవాలన్నారు.

గ్రామాల్లో శానిటేషన్ పట్ల నిర్లక్ష్యం చేయకుండా ప్లాస్టిక్ వినియోగంను నిరోధించేలా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రేవంత్ సూచనలు చేశారు. మొదటిసారి మండలానికి వచ్చిన డీపీవోను ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, కారోబార్ వాసాల రాములు, ఎఫ్ఎ సురేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

-ఎస్పీ అశోక్ కుమార్



ఎస్పీకి పూల మొక్క అందిస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు

జగిత్యాల టౌన్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పదోన్నతిలో భాగంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి జగిత్యాల జిల్లాకు బదిలీ అయి వచ్చిన 11 మంది హెడ్ కానిస్టేబుళ్ళు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పదోన్నతి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ ప్రజల్లో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జననం

భీమారం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలం లింగంపేట గ్రామానికి చెందిన సంధ్య ఐదు రోజుల క్రితం ఒకే కాన్పులో ముగ్గురికి జన్మనిచ్చింది. కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సంధ్యకు సిజేరియన్ చేయగా ఇద్దరు కూతుళ్లు, ఒక అబ్బాయి జన్మించారు. ఇద్దరు అమ్మాయిలు 2కిలోలు, 1.5 కిలోలు ఉండగా, అబ్బాయి 2 కిలోల బరువు ఉన్నాడు. తల్లి, ముగ్గురు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. సంధ్యకు ఇది రెండో కాన్పు కాగా, అంతకుముందు ఐదు సంవత్సరాల కూతురు ఉంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రాము

వెల్గటూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమైక్య రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చిప్ప నందయ్య, పీడీ రాజ్ కుమార్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా అక్టోబరు 23న కెహెచ్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ ఆవరణలో జరిగిన కరీంనగర్ జిల్లా జోనల్ స్థాయి పోటీల్లో రెండు, మూడవ స్థానాలను పొందిన వెల్గటూర్ విద్యార్థులు బట్టు గ్రీష్మ, గజ్జల శ్రీవిద్యలు టేబుల్ టెన్నిస్ పోటీలలో ప్రతిభ కనబరచి త్వరలో మేడ్చల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులు టేబుల్ టెన్నిస్ రాణించడం అభినందనీయమని డీఈవో రాము, జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ చక్రధర్, ఎంఈవో ప్రభాకర్ పేర్కొన్నారు.

మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

రాయికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం రాయికల్ మండల పాఠశాలల స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఎంఈవో రాఘవులు తెలిపారు. ఇందులో భాగంగా అండర్-14, 17 బాల, బాలికలకు పరుగు పందెంలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, హైజంప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణప్రసాద్, పీడీలు, పీఈటీలు రాజ్‌గోపాల్, గంగాధర్, సుజాత, రమేష్, కిషోర్, సుప్రియ, ప్రతాప్, గంగాధర్, రవీష్, సత్య, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రాయికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగార్జున అన్నారు. మండలంలోని అల్లీపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామ్‌నగర్, సింగరావుపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు.

●ఎండపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సొసైటీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మారేడుపల్లి, మంజంపల్లి, ఉండేడ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బయ్యపు మనోహర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పోలోజు శ్రీనివాస్, బాలసాని మల్లేశం, ఆవుల తిరుపతి, సింగిరెడ్డి లింగారెడ్డి, గాజుల విజయ్, మేకల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

●బుగ్గారం: మండలంలోని యశ్వంత రావుపేట, గోపులాపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మార్కెట్ చైర్మన్ స్థానిక అధికారులు, నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఏపీఎం రమాదేవి, మండల అధ్యక్షులు వేముల సుభాష్, కాంగ్రెస్ నాయకులు కండ్లే మదన్ బీర్పూర్ తిరుపతి, బండారి మహేష్, సమీద్, తదితరులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్ధతు ధరను పొందాలని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. గురువారం మండలంలోని కొండ్రికర్ల, కోనరావుపేట గ్రామాల్లో మెట్లచిట్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోరుమంతుల ప్రవీణ్, గంగాధర్, నాయకులు ఆకుల శ్రీనివాస్, పెంట ప్రవీణ్, సతీష్, పెంట ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు

జగిత్యాల టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో గురువారం డిపో మేనాజర్ కల్పన ఆర్టీసి సిబ్బంది, ప్రయాణికులకు బస్సు ప్రమాదలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డియం మాట్లాడుతూ ప్రయాణికులు బస్సు ఎక్కె అప్పుడు, దిగే అప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై రవి కిరణ్, యం ఎఫ్. కవిత, స్టేషన్ మేనేజర్ రవిందర్ రావు, హెడ్ కానిస్టేబుల్ శేఖర్, జగిత్యాల ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ఆగిన రైతు గుండె

-సిర్పూర్‌లో విషాదం

మల్లాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను అమ్ముకొనే క్రమంలో మల్లాపూర్ మండలంలోని నడికుడ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో రైతన్న గుండె ఆగింది. మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన ఏలేటి రాజారెడ్డి(60) అను రైతు గ్రామంలో పండించిన పంటను విక్రయించడానికి నడికుడ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రానికి ఈనెల 4న ధాన్యం తీసుకొచ్చాడు. ధాన్యం మ్యాచర్ కోసం పోసిన ధాన్యం కుప్పను ఆరబెడట్టడానికి భార్యతో కేంద్రానికి వెళ్లాడు. కేంద్రంలో ఆరబెట్టుతుండగా గుండె పోటుకు గురై అక్కడే కుప్పపై పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. రాజారెడ్డికి కుమారుడు జీవనోపాధి నిమిత్తం కెనడా వెళ్లాడు. తండ్రి మరణ వార్త తెలుసుకున్న కొడుకు అంత్యక్రియల కోసం నిర్వహించడానికి ఇంటికి వచ్చాడు. కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణరావు సిర్పూర్‌లోని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

రాయికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో రాయికల్ పట్టణంలోని విజ్డమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 8 మంది క్రీడాకారులు 12 విభాగాల్లో పతకాలు సాధించారు. పాలడుగు శ్రేష్ట (డిస్కస్ త్రో గోల్డ్), దొంగ రేష్మా (200 మీ.రన్నింగ్ సిల్వర్), పడకంటి జాహ్నవి (డిస్కస్ త్రో సిల్వర్), చిదుమల్ల శాన్విక (100 మీ., 200 మీ. లాంగ్ జంప్ గోల్డ్), నోసిన మనీశ్వర్ సాయి (లాంగ్ జంప్, హై జంప్‌లో సిల్వర్), కొత్త అక్షిత్ (లాంగ్ జంప్, హై జంప్‌లో గోల్డ్, 200 మీ. రన్నింగ్‌లో సిల్వర్), కాసారపు మహీధర్ (డిస్కస్ త్రో లో సిల్వర్) పతకాలు సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లా స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ కృష్ణ ప్రసాద్, పీఈటీ రమేష్‌లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, డైరెక్టర్ నివేదిత రెడ్డి అభినందించారు.

●మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రామాజీపేట పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గుర్రం అలేఖ్య 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్, గుర్రం నందిని డిస్కస్ త్రో లో మొదటి బహుమతి, దీపక్ హైజంప్ ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గజ్జెల నరేందర్ తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్‌బాబు

కోరుట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సీఐ సురేష్ బాబు విద్యార్థులకు సూచించారు. గురువారం పట్టణంలోని పీఆర్‌బీఎం కళశాలలో కరస్పాడెంట్ పోతని ప్రవీణ్ కుమార్ అధ్వర్యంలో పోలీసుల అధ్వర్యంలో సైబర్ క్రైమ్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

●ధర్మపురి: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ధర్మపురి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ అధ్వర్యంలో సైబర్ మోసాల గురించి విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉదయ్‌కుమార్ మాట్లాడు కార్యక్రమంలో కళశాల ప్రిన్సిపల్ కాళ్ల లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

●బుగ్గారం: విద్యార్థులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకూడదని స్థానిక ఎస్సై సతీష్ సూచించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ గ్లోబల్ హై స్కూల్ లో విద్యార్థులకు గురువారం సైబర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ నక్కరాజు, పోలీస్ కానిస్టేబుల్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

●సారంగాపూర్: మండంలోని రేచపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సాంస్కృతిక సారధి కళాకారుల కళాజాత ప్రదర్శనను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సంతోష్, మాజీ సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కళాకారులు పరుశురామ్, మహిపాల్, రాజేందర్, ప్రవీణ్, సురేష్ నాయక్, రమేష్, అశక్షక్, ప్రకాష్, రాజ్‌కుమార్, రమ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


●పెగడపల్లి: సైబర్ క్రైం మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పెగడపల్లి ఎస్ఐ ఇకిరణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైం మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రిన్సిపాల్ మీనాక్షి, పోలీస్ సిబ్బంది రవీందర్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

బీర్‌పూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ డీఆర్‌డీవో మదన్ మోహన్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, హౌసింగ్ ఏఈ, క్లస్టర్ ఆఫీసర్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలో నిర్మాణాలలో ఉన్నా ఇందిరమ్మ ఇంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, బుగ్గారం, వెల్గటూర్ మండలాలకు చెందిన ట్రైనింగ్ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

టికెట్ ధరల పెంపు యోచన విరమించుకోవాలి

మల్యాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో అర్జిత సేవల ధరల పెంపు యోచన విరమించు కోవాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆలయ అధికారులకు వినతిపత్రం అందించారు. కొండగట్టుకు ఎక్కువగా వచ్చేది సామాన్య భక్తులేనని, వారిపై ఆర్థికభారం మోపడం సరికాదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కనీస వసతులు మరుగుదొడ్లు, వసతి సౌకర్యాలు లేక భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మొదటి ఆ దశగా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, కొక్కెర మల్లేశం యాదవ్, గౌతం, బండారి రాజు, నీలం రవి, రాఘవేంద్ర, ఆనందం, రమేశ్, శ్రీనివాస్ ఉన్నారు.



ఆలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు